# ఒంటరి - పత్తుగులాబి

మారేమండ సీతారామయ్య

ఆకాశం విలపిస్తున్నది

మేఘాలలో దాచుకున్న కన్నీటితో భూమాతను అభిషేకం చేస్తోంది!

నా గదిలోకి ఓ మెరుపు వచ్చి పలకరించిపోయింది. లేదు...లేదు...నా పరిస్థితిని చూసి పరిహసించి పారిపోయింది.

అవును! నా పరిస్థితిపై నాకే జాలి వేస్తోంది

దూరంగా ఎక్కడో రిక్షామోత!

దగ్గరలో–ఎదలో ఘోష!

బల్లమీద మూర్తి, శాంతీ వ్రాసిన ఉత్తరాలు గాలికి రెపరెపలాడుతున్నాయి.

ఒకేరోజు ఇద్దరు ఆత్మీయుల వద్దనుంచి ఉత్తరాలు.

ఆ ఉత్తరాలలో ఇద్దరి ఆక్రోశం ఒకటే! ఒకటె ఒక ప్రధాన విషయం!

నా మీద వారి కెందుకింత శ్రద్ధ?


తెగిన గాలిపటం దూరంగా వెళ్ళిపోతుంది!

గాలిపటం లాంటిదే నా జీవితం కూడా!

కాని ఎంత ప్రయత్నించినా దూరంగా పోవటం లేదు! ప్రాపంచిక ప్రభావం ప్రయత్నించినా పోవటం లేదు!

ఇంత నిరాశా చీకటిలోనూ ఎక్కడో ఓ చిన్న ఆశా మిణుగురుపురుగు

గతాన్ని మరచిపోయి, గడవబోయే కాలాన్ని గురించి ఆశాభావన!



టేబుల్ మీద బుద్ధ భగవానుని విగ్రహం ప్రశాంతతలో ప్రకాశిస్తోంది

అర్ధనిమీలితమైన ఆ మూర్తిలో ఏదో సందేశం! ఏదో తేజస్సు!!

కాంతిలేని జీవితాలకు ప్రశాంతి చేకూర్చే సందేశం! కాంతిలేని జీవితాలకు వెలుగుబాట ఆ తేజస్సు!

"నువ్వు కాదనటానికి వీల్లేదు! నే చెప్పినట్టు జరిగితీరవల్సిందే లేకపోతే ఈ జన్మకి నీకూ నాకూ సంబంధం లేదు!" ప్రక్క ఇంటిలో తండ్రీ కొడుకుల కీచులాట!

కీచులాటా? కాదు! రాజీకి హెచ్చరిక!

గాలి గట్టిగా వీచింది.

టేబుల్ మీద పుస్తకంలోంచి ఓ కాగితం ఎగిరి కాళ్ళకు చుట్టివేసింది!

శాంతి ఇచ్చిన కడసారి బహుమానం!

బాలభాస్కరుడు రెండుకొండల నడుమునుంచి తొంగిచూస్తూ పసిడి పంట చేలోకి కిరణాలు ప్రసరింప చేస్తున్నాడు. ఆ ప్రశాంత ప్రకృతిలో మఱ్ఱిచెట్టు క్రింద ఓ యువకుడు అర్ధ నిమీలితుడై గానం చేస్తున్నాడు!!

క్రింద "హృదయపూర్వకంగా - శాంతి!"

ఓనాడు ఆ చిత్తరువు నా ఆరాధ్య దైవం!

కాని నేడు......

కిటికీ తలుపులు బాధగా కిర్రు మన్నాయి!

మదిలోని తలపులతో మనస్సు చివుక్కుమంటోంది!

"రాముడూ! ఎడారిలో మన అడుగుజాడ లుండాలి! మన తర్వాత మన సంతానం ఆ జాడల్లో నడవాలి!"

మూర్తి ఉత్తరంలో మాటలు—

"ఒక స్త్రీ నుండి నువ్వు ఆశించేది ప్రేమేనా? ఆ ప్రేమ సోదరప్రేమ కాకూడదా?" శాంతి సూటి ప్రశ్న.

మూర్తి ఉత్తరం ఎందుకో మళ్ళా చదవాలనిపించింది!

"రాముడూ!"

ఎంత చల్లని సంబోధన! ఆప్యాయతకీ, అనురాగ స్రవంతికీ ప్రతి బింబం, ఆ చల్లని పిలుపు.

"మొన్న మీనాన్నగారి వద్దనుంచి ఉత్తరం వచ్చింది. నీ గురించి చాలా వ్రాశారు నేను ఆ మాటలు వ్రాయ లేక నీకు పంపుతున్నాను. ఒక్కసారి చదువుకో! కాని ముందు ఓ మాట! "తెగిన వీణె రాగాలు పలికించలేదు! ఎడారిలో మొక్కలు పుష్పించలేవు!! మోడువారిన మనస్సులలోను, బండ బారిన మనస్సులలోను, మమతా, అనురాగాలు ఉండవు!" అని నాకో ఉత్తరం వ్రాశావు. అంత నిరాశగా ఎందుకు వ్రాశావు? జీవితంలో ప్రేమించవచ్చు కాని దాని ఫలితం వివాహం అవవచ్చు! కాకపోవచ్చు తెగిన వీణకు తీగలు వేయవచ్చు. ఎడారిలోకూడాఒయాసిస్సులుంటాయి కదూ! నీ హృదయం బండగా మారి ఉండచ్చుగాని, స్వతహాగా బండ కాదుగా! ఐనా అమావాస్య తరువాత పౌర్ణమి రాకుండా ఉంటుందా? రాత్రి అంతమై పగలు రాజ్యం ఏలదూ? హేమంతం ప్రవేశిస్తే వసంతకాలం దూరంగా ఉండగలదా?

మన జీవితాలలో విచిత్రమైన సంఘటనలు అనేకం జరగవచ్చు. అందులో నీ ప్రేమ ఒకటి! గతం మరచి భవిష్యత్తుకు బంగారు బాట నిర్మించు! మార్గంలోని ముళ్ళను ఏరి నీ మార్గం ప్రయాణదాయకంచేసుకో! ఎడారిలో మన అడుగుజాడలుండాలి! మనతరువాత మనసంతానం వాటిల్లో

నడవాలి! పెళ్ళిలేని జీవితానికి అర్థం లేదు! జన్మసార్థకతకు అవకాశంలేదు! ప్రేమ త్యాగాన్ని, కామం ఫలాన్ని కోరుతుందట! నువ్వు ప్రేమించావు కాని కామించలేదుగా? నీవు పెళ్ళి చేసుకోకపోటానికి నీ భగ్న ప్రేమ కారణం కాకూడదు! ఉత్తరం వెంటనే వ్రాయి!''

దానిలోనే నాన్నగారి ఉత్తరం ''మూర్తీ!

నీవు క్షేమమని తలుస్తాను మా రాముడు దగ్గరనుంచి ఉత్తరాలు రావటంలేదా! ఏ నెల్లాళ్ళ కొకసారో వ్రాస్తున్నాడు. మొన్న పెళ్ళి విషయం గురించి వ్రాస్తే ఇప్పటిలో చేసుకునే ఉద్దేశ్యంలేదని వ్రాశాడు వృద్ధాప్యంలో వాడి పిల్లలను చూస్తూ కాలం గడపాలని, వారితో ఆడుకోవాలని కోరికలు మాకు ఉండటం సహజమే! మాకు పుట్టిన ఆడపిల్లకు ఆ రేండ్ల ప్రాయంలోనే నూరేండ్లు తీరిపోయాయి! ఇక వీడు చూస్తే పెద్ద ముఖం. మా వంశవృక్షానికి, కాయలు పండ్లు వేరేలేవు! ఆ వృక్షం ఇంక చిగురించబోదేమో! నువ్వు ఈ విషయంలో కొంచెం ప్రయత్నించు! మండే మా వృద్ధ దంపతుల ఎదకు, కొంత శాంతి ప్రసాదించే యత్నం చేయి!'' నాకు ''శాంతి'' లేకపోవటం వల్ల మీరు కూడా శాంతిరహితులయ్యారు!......''

పాపం!

కన్నీటిని కడుపులో, బాధలు ఎదలో దాచుకొని, పైకి నా సుఖం కోసం ఏమీ అనలేని పుణ్యమూర్తులు! శాంతికవరు!

అర్ధముకుళితమైన ఎఱ్ఱగులాబి కుసుమండి మాలగా చిత్రించబడి ఉంటుంది సిగ్గుతో తలదించుకుని నేను బొటనవ్రేలుతో వ్రాసే ఆమె జ్ఞాపకం వస్తోంది ఆ గులాబీని చూడగానే! తన నైపుణ్యాన్ని మూర్తీభవింప చేసి చిత్రించిందికా మోను!

కవరుమీద పొందికగా అక్షరాలు!

''డియర్ రామ్''

మూర్తిగారి ద్వారా నీ అడ్రస్ తెలుసుకున్నాను. ''నీవు ఈ ఊరు నుండి ఎప్పుడు వెళ్ళిపోతావు, నాకు తెలియపరచగోరెదను'' అని వ్రాసిన నా ఉత్తరానికి జాబులేదు! సరికదా మనిషివి కనిపించకుండా వెళ్ళిపోయావు. ఆఫీసులో వాకబుచేస్తే ట్రాన్స్ఫర్ అయిపోయిందని చెప్పారు. నా నుంచి అంతదూరంగా వుంటావెందుకు నా పేరు శాంతిగాని, నీ పాలిటి అశాంతినయ్యాను నీ ఎదలో ఎన్నో ఆశలు పెంచాననుకుంటాను. పెంచుకున్న ఆ ఆశలతోనే నీ హృదయంలో ఓ మందిరం నిర్మించి పూజారివై

అక్కడ నా గురించి నిరీక్షించావు! కాని తప్పంతా నాది. నేను నా బావ గురించి పుట్టాను. ఆయన చాలా సోష ల్‌గా ఉంటారు. అందుకే నా ఈ మేనరికం మరుగుపరిచి, నీతో స్నేహం చేశాను! కాని నా స్నేహాన్ని నీవు అపార్థం చేసుకున్నావు. ఒక స్త్రీనుండి నువ్వు ఆశించేది ప్రేమేనా? అది సోదరప్రేమ కాకూడదా? నువ్వు లోకంలో చాలా తెల్సుకోవాలి. ప్రయత్నించు! నా ప్రవర్తనవల్ల నీకు దురభిప్రాయం కలిగించంటే అది నా దురదృష్టం. మనుషులను అర్థం చేసు కోవటం నేర్చుకో! రాబోయే నీ భార్య చాలా అదృష్టవంతురా లౌతుంది స్నేహితురాలుగా నా సహాయసంపత్తులు నీకు ఎప్పుడూ వుంటాయి. ఇష్టం ఉండి, వీలు చిక్కితే జాబు వ్రాయి! నా గురించి ఆలో చించి మనస్సు పాడుచేసుకోకు! త్వరలో నీ పెండ్లి శుభలేఖకు ఎదురు చూసే నీ స్నేహితురాలు,

—శాంతి"

అవును! నిజంగానే నేను తెల్సుకో వలసింది ఈ లోకంలో చాలా ఉంది. ప్రయత్నించాలి!

ఎడారిలో మన అడుగు జాడ లుండాలి.

మన సంతానం ఆ జాడల్లో అడు గులు వేయాలి!

మూర్తి వ్రాసిన విషయం సర్వదా సత్యం!

నాన్నగారి ఆందోళన!

మూర్తి పరితాపన!!

శాంతి ఆక్రోశం!!!

ఎందుకు?

నా వివాహ విషయమైకదూ?

నా జన్మదాతలసుఖం, నా ప్రాణ మిత్రుని కోరిక తీర్చటాని కంటే నాకేం కావాలి?

హృదయం తేలికపడింది.

బుద్ధ భగవానుని విగ్రహంలో తేజస్సు పెరిగింది!

ఆకాశం ప్రశాంతంగా ఉంది!

శోకించిన జాడ లున్నాయి కాని, ఆ కన్నీరు ఇంకిపోయింది! మొయిలు లోని నలుపు మాయమై, భూమిలో కల్సిపోయి, స్వచ్ఛంగా ఉంది!

ప్రక్కవాటాలోని తండ్రీ కొడు కులు సినిమాకు పోవటానికి రిక్షా పిలుస్తున్నారు.